సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్వీ నాయకుడు కానుగుల మహేశ్ నగరం లోని ఆమె నివాసంలో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. - ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 16

సమస్యల పరిష్కారానికి కృషి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి
- మొగిలిగిద్దలో పర్యటన
- సీఎం పర్యటనపై ఏర్పాట్లు, స్థల పరిశీలన

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్, జనవరి 16 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. మొగిలిగిద్దలో ప్రభుత్వ పాఠశాల ఏర్పడి 150 వసంతాలు పూర్తయింది. ఈ సందర్భంగా గ్రా మస్తుల వినతిమేరకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రామానికి వస్తున్నట్లు తెలియజేయడంతో ఇక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రాథమిక అరోగ్య కేంద్రం, కస్తూర్బా కళాశాలలో ఎంపీసీ, బైపీసీతో పాటు సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కళాశాల, పాఠశాలను శుభ్రపరిచేందుకు పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని, నూతన పాఠశాలలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, సీసీ రోడ్లు తదితర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. గ్రామస్తులు విన్నవించిన సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. అలాగే గ్రామంలో సీఎం పర్యటిస్తుండడంతో స్థల పరిశీలనతో పాటు ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

నందిగామ : నందిగామ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. ధరణి స్థానంలో భూ భారతి కొత్త పోర్టల్ వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించినట్లు సమాచారం.

దవాఖానాలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మెరుగైన వైద్యం అందించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పీహెచ్‌సీలో మరమ్మతుల పరిశీలన

నవాబుపేట, జనవరి 16 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. గురువారం కలెక్టర్ నవాబుపేట మండల పరిధిలో పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులు, వట్టిమీనపల్లిలో ఇందిరమ్మ ఇండ్లు, పులుమామిడిలో రైతు భరోసా సర్వేలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లక్ష్యాలకు మించి ప్రసవాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దవాఖానల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులను కేటాయిస్తామన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. దవాఖాన భవనంపై జరుగుతున్న మరమ్మతులను వారం రోజుల్లో నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైట్లు, ఫ్యాన్లు సరిపడా అమర్చుకోవాలని అధికారులకు సూచించారు. దవాఖానలో కిటికీలు, వెంటిలేటర్లకు దోమతెరలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవనంపై చెత్తాచెదారంతో పాటు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దవాఖానాలోని ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

అనంతరం వట్టిమీనపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే, రైతు భరోసా సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసాను అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గుర్తుజేశారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా వట్టిమీనపల్లి అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సామ్ మామ్ పిల్లల వివరాలను, బియ్యం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీకి సరఫరా చేస్తున్న బాలామృతం, బియ్యం తదితర వాటిని ఎప్పటికపుడు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని టీచర్‌కు సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు విధిగా పర్యటించి తనిఖీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, పీహెచ్‌సీ డాక్టర్ రోహిత్, సూపరింటెండెంట్ అజయ్ కుమార్, బూల్యా, మీనపల్లి పంచాయతీ కార్యదర్శి గీత ఉన్నారు.

నేడు బీఆర్ఎస్‌లో చేరికలు

చేవెళ్ల రూరల్, జనవరి 16 : చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్ఎస్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ గురువారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతున్నదన్న ఆశాభావంతో బీజేపీ నాయకులు దాదాపు 100 మంది గులాబీ గూటికి చేరుతున్నట్లు తెలిపారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంపు

- మార్చి 31వరకు అవకాశం
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి మల్లేశం

వికారాబాద్, జనవరి 16 : పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు కోసం గడువు పొడగించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి మల్లేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్‌కు) పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు గమనించి ఈ-పాస్ వెబ్ సైట్ http://telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేకంగా అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం నూతన ప్రక్రియ విధానంలో మూడు దశల్లో దరఖాస్తు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. డెమో అథంటికేషన్, బయోమెట్రిక్ అథంటికేషన్, దరఖాస్తు నమోదు నూతన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షలకు మించకూడదన్నారు. ఈ ప్రక్రియ అంతా ఈపాస్ వెబ్‌సైట్‌లో ఉంటుందన్నారు. వికారాబాద్ జిల్లాలోని సంబంధిత కళాశాల యాజమాన్యాలు ఎస్సీ విద్యార్థులకు తగు సూచనలు చేసి వందశాతం రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలుతీసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయం రూమ్ నంబర్ 10, వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి

- ఢిల్లీ సీసీఆర్టీ మాజీ డైరెక్టర్ గిరీశ్‌జోషి
- అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో భూమి-సంస్కృతి అంశంపై ప్రారంభమైన జాతీయ విద్యా సదస్సు

ఎర్త్ సెంటర్ అవరణలో మొక్కలు నాటుతున్న విశ్రాంత ప్రొఫెసర్లు, పర్యావరణ శాస్త్రవేత్తలు

కడ్తాల్, జనవరి 16 : విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని ఢిల్లీ సీసీఆర్టీ మాజీ డైరెక్టర్ గిరీశ్ జోషి, ఉమ్మడి ఏపీ ఎస్సీఆర్టీ విశ్రాంత ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో ఉన్న ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థ-సీసీఆర్టీ, డీఆర్పీ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న 'భూమి-సంస్కృతి' జాతీయ సదస్సు సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ అధ్యక్షతన గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సులో 16 రాష్ట్రాలకు చెందిన 60 మంది డీఆర్పీలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరీశ్‌జోషి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశంలో పుడమి ప్రాధాన్యతను, సంస్కృతిని తెలియజేసే పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించాలని తెలిపారు. విద్యార్థులకు భూమి ఆవశ్యకత, సంస్కృతి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో భూమిపై జరిగే గ్లోబల్ వార్మింగ్‌తో భూకంపాలు, సునామీలు, వాతావరణ కాలుష్యంతో మానవాళిని భయకంపితులను చేస్తాయని తెలిపారు. నివారణకు ప్రతి ఒక్కరికీ పర్యావరణంపై అవగాహన ఉండి ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. అనంతరం ఎర్త్ సెంటర్‌లో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్తలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, సాయిభాస్కర్‌రెడ్డి, మృతిక, డీఆర్పీలు ప్రభాకర్, రాజమల్లు, వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, సీజీఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఎస్సైలతో ఎస్పీ నారాయణరెడ్డి

9 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి

వికారాబాద్, జనవరి 16 : వికారాబాద్ జిల్లాలో 9 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పించామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం గురువారం ఎస్పీకి తన కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఎస్సైలను ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు.

బస్సెనక బస్సులు

స్టేజీ వద్ద నిలపకుండానే వెళ్తుండగా వీడియో తీసిన ప్రయాణికులు

వరుసగా మూడు బస్సులు వెళ్తున్న దృశ్యం

పరిగి, జనవరి 16 : చేయి ఎత్తిన దగ్గర బస్సు నిలపాలన్నది ఆర్టీసీ ప్రాథమిక సూత్రం. ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడిపిస్తే ఆదాయం వస్తుందన్నది వాస్తవం. అలాంటిది బస్సు వెనకాల బస్సు, ఏకంగా నాలుగు బస్సులు వెళ్తూ కనీసం స్టేజీ వద్ద ఆపకుండా వెళ్లడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్ వైపు నుంచి పరిగికి ఒకేసారి నాలుగు బస్సులు ఒకదాని వెనక మరోటి వచ్చాయి. వాటిలో ఏ ఒక్క బస్సు నిలపకుండా వెళ్లడంతో ముజాహిద్‌పూర్ స్టేజీ వద్ద నిల్చున్న ప్రయాణికులు వీడియో తీశారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. పరిగి-మహబూబ్‌నగర్ రూట్‌లో ప్రతి నిత్యం ఇదే పరిస్థితి ఉంటుందని వారు వాపోతున్నారు. వెళ్తే ఒకేసారి కనీసం మూడు బస్సులు వెళ్తుంటాయని, ఒక్కోసారి నాలుగు బస్సులు ఒకదాని వెనకాల ఒకటి వెళ్తుండడంతో మిగతా సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఒకేసారి బస్సులు వెళ్లడంతో సమయానికి బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మరోవైపు ఆర్టీసీకి నష్టమేనని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొని ఒకేసారి మూడు, నాలుగు బస్సులు కాకుండా కొంత వ్యవధితో నడిచేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అమాయక రైతుల భూముల దోపిడీ



రాచలూరులో బాధిత రైతులతో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ నాయకులు

- ఫోర్త్ సిటీ పేర దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- రైతులకు అండగా ఉంటాం: సీపీఎం నాయకులు

కందుకూరు, జనవరి 16: రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరుతో అమాయక రైతుల భూములు లాక్కొంటుందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. రైతులకు తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కందుకూరు మండల పరిధిలోని రాచలూరు తదితర గ్రామాల్లో గురువారం పరామర్శించి బాధిత రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అగర్‌మియగూడ, లేమూరు, రాచలూరు, తిమ్మాపూరు, తుర్కగూడ, ఆకుల మైలారం, గుమ్మడవెల్లి గ్రామాల్లో బేగరి కంచ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీకి 330 ఫీట్ల రోడ్డును తమ పొలాలగుండా ఏర్పాటు చేస్తున్నారని, దీంతో తమకు ఉన్న ఎకరం, రెండు ఎకరాల భూమితో పాటు పౌల్ట్రీ ఫారాలు, కూరగాయాల తోటలు, సేద్యం చేస్తున్న విలువైన భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము బజారున పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా తమ భూములు ఎకరాకు రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతుందని, ప్రభుత్వం తమకు రూ.70 లక్షల ఇస్తామని, తమకు తెలియకుండా భూములను పోలీస్ బందోబస్తు మధ్య సర్వేను నిర్వహించారని చెప్పారు. తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని, ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడానికి చూస్తుందని చెప్పారు. అనంతరం, యాదయ్య మాట్లాడుతూ, భూ నిర్వాసితులకు అండగా ఉంటూ పోరాటం చేస్తామని చెప్పారు. సేద్యం చేస్తున్న ఏ రైతు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు. రైతుల భూములను లాక్కుంటే ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంచందర్, సామ్యేల్, నరసింహ, కవిత, చంద్రమోహన్, జగన్, మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, మండల కమిటీ నాయకులు బుడ్డీరపు శ్రీనివాస్, అంకాగాల్ల కుమార్, రాయిచెట్టు చందు, శ్రీశైలం, రాములు, కాళిదాస్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్తఎత్తులు

దొంగ ఖాతాల నుంచి ఆన్‌లైన్ కొనుగోళ్లు

లింకున్న ఖాతాలు ఫ్రీజ్ చేస్తున్న దర్యాప్తు సంస్థలు

ఇటు సామాన్యులకు.. అటూ వ్యాపారులకు ముచ్చెమటలు పట్టిస్తున్న సైబర్స్



సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు తెరలేపుతూ ఆన్‌లైన్ వ్యాపారులను బెంబేలెత్తిస్తున్నారు. బాధితుల వద్ద కొట్టేసిన సొమ్మును ఈ-కామర్స్, ట్రావెల్ ఏజెంట్ల సైట్లకు మళ్లించి తమకు కావాల్సిన వస్తువులు, ఫ్లైట్ టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. బాధితులు డిపాజిట్ చేసిన సొమ్ము ఏ ఖాతా నుంచి ఏ ఖాతాలోకి బదిలీ అయ్యిందనే విషయంపై పోలీసులు దర్యాప్తు జరిపినప్పుడు డిస్టినేషన్ ఖాతా రెగ్యులర్‌గా వ్యాపారం చేసే వారిదై ఉంటుంది. సైబర్ నేరగాళ్లకు చెందిన ప్రధాన బ్యాంకు ఖాతాలకు ఆయా వ్యాపారులకు సంబంధించిన ఖాతాకు లింక్ ఉండటంతో రెండు, మూడు, నాలుగు లేయర్లలో ఉండే వ్యాపారుల ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతున్నాయి. ఇలా సైబర్‌నేరగాళ్లు ఆన్‌లైన్ వ్యాపారులను కూడా హడలెత్తిస్తున్నారు. పోలీసులు బ్యాంకు ఖాతాలు లింక్ ఉండటంతో మేం ఫ్రీజ్ చేశామని, అది దొంగ సొత్తు అని, మీ ఖాతాకు నేరానికి సంబంధించిన సొమ్ము ఉన్నంత వరకు మీరు బాధ్యులే అవుతారని చెబుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు తమకు తెలియకుండా జరిగిందని, ఎంత సొమ్ము మా ఖాతాలో పడిందో ఆ సొమ్మును బాధితుడికి ఇచ్చేస్తామని, మా ఖాతాలు డ్రీఫీజ్ చేయాలంటూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న ఘటనలు ఉంటున్నాయి.

ఆన్‌లైన్ సైట్లే కీలకం...!

ఈ-కామర్స్, ట్రావెల్ ఏజెన్సీ తదితర ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహించే సైట్లను సైబర్‌నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వివిధ సైబర్ నేరాలలో బాధితులు డబ్బులు సైబర్‌నేరగాళ్లు సూచించే బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయడం ఆయా ఖాతాలకు నగదు బదిలీ చేయడం చేస్తుంటారు. ఇలా మొదటి ఖాతాలో పడే సొమ్మును విభజిస్తూ ఇతర ఖాతాల్లోకి బదిలీ చేస్తుంటారు. ఇలా బదిలీ చేసే క్రమంలో తమ టీమ్‌లకు అవసరమైన బల్క్ ఫ్లైట్ టిక్కెట్లు, ఈ -కామర్స్‌లో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసే సమయంలో లక్షల్లో చెల్లింపులు ఉండటంతో ఆయా నేర ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. అయితే ఈ-కామర్స్ వ్యాపారులకు అది దొంగ సొమ్మా? కదా అనే విషయంపై పట్టింపు ఉండదు. తమ ఖాతాకు నగదు బదిలీ అయ్యిందా అంతే దానికి ప్రతిఫలంగా వస్తువు డెలివరీ చేయాలని తమ పనిలో నిమగ్నమవుతారు. ఇక్కడే కొన్ని సెక్యూరిటీ చెక్స్ పెట్టుకోవడంతో సైబర్‌నేరగాళ్ల ఖాతాతో లింకున్న అనుమానిత బ్యాంకు ఖాతాలను గుర్తించేందుకు వీలుంటుంది.

ఈ-కామర్స్ వెబ్‌సైట్లకు ఛాలెంజ్

సైబర్ నేరగాళ్లు ఈ-కామర్స్, ట్రావెల్ ఏజెన్సీ వెబ్‌సైట్లకు ఛాలెంజ్ విసురుతున్నారు. అంతా ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు జరుగుతున్న క్రమంలో కొనేవాడు ఉపయోగించిన బ్యాంకు ఖాతా నిజమైందా? దొంగదా? అని గుర్తించడం కష్టంగానే మారుతున్నది. దీంతో ఆన్‌లైన్ కొనుగోలు వ్యవహారాలలో మరింత సెక్యూరిటీని, ఖాతాదారుల నిర్ధారణకు సంబంధించిన ఆప్షన్స్ ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని సైబర్‌నిపుణులు పేర్కొంటున్నారు. సైబర్‌నేరగాళ్లు ఉచ్చులో చిక్కి ఇటు సామాన్యులు బాధితులవుతుండగా, అదే విధంగా వ్యాపారులు సైతం కొన్ని సందర్భాల్లో బాధితులుగా మారుతున్నారు.

పారదర్శకతతో బోర్డు ప్రతిష్టను కాపాడండి

శిక్షణ తరగతిలో ఈడీ మయాంక్ మిట్టల్

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ): జల మండలికి కొత్తగా కేటాయించిన జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు గురువారం శిక్షణ అందించారు. ఈ శిక్షణను ఈడీ మయాంక్ మిట్టల్ ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, పనిలో పారదర్శకత పాటించాలని ఈడీ చెప్పారు. బోర్డు ప్రతిష్టను కాపాడేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఈ శిక్షణ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గండిగూడలో సర్వేను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 16 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు,ఆర్ఐ కృష్ణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో టీ హబ్ స్టాల్ ప్రారంభం

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో టీ హబ్‌ను ప్రారంభించిన టీ హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్

అబిడ్స్, జనవరి 16: అఖిల భారత 84వ పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఇన్నోవేషన్ పెవిలియన్, టీ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ హబ్‌ను టి హబ్ సీఈఓ సుజీత్ జాగిర్దార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె. నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సలహాదారులు ఆదిత్య మార్గం, కన్వీనర్ ఎం. చంద్రశేఖర్, జాయింట్ కన్వీనర్ సీజే శ్రీనివాస్, పి.దీప్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గాంధీ శిల్పా బజార్ మేళాలో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా చంద్రశేఖర్, ప్రణవిల శిష్య బృందాలు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. - కొండాపూర్, జనవరి 16